డంపు.. కంపు వద్దు

గుమ్మడిదల, నల్లవల్లిలో కొనసాగుతున్న ఆందోళనలు

14వ రోజు బతుకమ్మ ఆడి మహిళల నిరసన 7

తాగునీటి కటకట 8

ఖమ్మం పల్లె ఎస్సీ కాలనీలో ఖాళీ బిందెలతో నిరసన

బొంతలతో బెడ్‌షీట్లు చేసిస్తామని మోసం

మెదక్ జిల్లా కేంద్రంలోని పలు వీధుల్లో రూ. వేలు వసూలు చేసి పరారు


మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా మోసగాళ్లు నిత్యం ఏదో రూపంలో బురిడీ కొట్టిస్తుంటారు. మోసానికి కాదేది అనర్హం అన్నట్టు మెదక్‌లో పాత బొంతల పేరిట వందలాది మంది మహిళలను మోసం చేశారు మోసగాళ్లు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చామని గోపాల్‌పేటలో బస చేస్తున్నట్టు చెప్పారు. తమకు పాత బొంతలు ఇస్తే కొత్త బెడ్‌షీట్లు తయారుచేసి ఇస్తామని చెప్పి నమ్మబలికారు. ఒక్కో బొంతకు రూ. 500 ఇస్తే నాలుగు రోజుల్లో అందమైన కొత్త బెడ్‌షీట్ తయారు చేసి ఇస్తామని నమ్మించారు. మహిళలను ఆకర్శించడానికి తమ వద్ద ఉన్న అందమైన బెడ్‌షీట్ నమూనా చూపించారు. దీంతో పాత దుప్పులే కదా... తక్కువ ధరకే బెడ్‌షీట్ వస్తుందంటూ గృహిణులు ఒక్కొక్కరు మూడు నాలుగు ఆర్డర్ ఇచ్చి రూ. వేలు సమర్పించుకున్నారు. ఒకేచోట కాకుండా మెదక్ పట్టణంలోని జమ్మికుంట, కువ్వతుల్ ఇస్లాం, నర్సీఖేడ్ ప్రాంతాల్లో వందల మంది మహిళల నుంచి డబ్బులు వసూలు చేసుకొని వెళ్లిపోయారు. వారం రోజులైనా తయారీ దారులు రాకపోవడంతో వాళ్లు ఇచ్చిన నంబర్ (8007423413)కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని గ్రహించిన లబోదిబోమంటున్నారు. కొందరు మహిళలు తయారీ దారుల ద్విచక్ర వాహన నంబర్‌ప్లేట్‌ను ఫోన్‌లో ఫొటో తీశారు. ఒక్కో బెడ్‌షీట్‌కు రూ. 500 మాత్రమే కదా అనుకుంటే.. ఇలా వందల మంది నుంచి రూ. లక్షల్లో వసూలు చేసినట్టు తెలుస్తున్నది. పట్టణంలో నిఘా పెట్టి మోసాలు జరగకుండా చూడాలని వేడుకుంటున్నారు మోసపోయిన బాధితులు.



డబ్బులు వసూలు చేసిన మోసగాళ్లు తిరిగిన ద్విచక్రవాహన నంబర్

సంగారెడ్డి పాత బస్టాండ్ సంగమేశ్వర గుడిలో
శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న జరుగనున్న మహాశివరాత్రి వేడుకల కోసం సంగారెడ్డిలో జరుగుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అతి పురాతనమైన సంగమేశ్వర ఆలయానికి కొత్త రంగులను వేయించారు. ఈ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, సౌండ్‌సిస్టమ్ తదితర ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. శివరాత్రి రోజున ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. పట్టణంలో ప్రతీ సంవత్సరం లాగే ఈ సారీ కూడా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జగ్గారెడ్డి వెంట టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, ఆలయ పూజారులు రాజ్ పంతులు, శివశర్మ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి సంగమేశ్వర ఆలయ గోశాలలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



ఆలయంలో శివరాత్రి వేడుకల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుంటున్న జగ్గారెడ్డి



మట్టి తవ్వడంతో క్వారీని తలపిస్తున్న కందిలోని పగడం చెరువు

మట్టి.. చెరబట్టి..

- జోరుగా అక్రమ తవ్వకాలు.. చెరువులు పొలాల నుంచి తరలింపు
- తరలింపు కోసం ఫార్మేషన్ రోడ్డు.. పట్టించుకోని అధికారులు

7

మంచాన పడిన భర్తకు సపర్యలు చేయలేక హత్య

- అల్లుడితో కలిసి భార్య ఘాతుకం
- సహజ మరణంగా చిత్రీకరించే యత్నం
- బంధువులు నిలదీయడంతో విషయం వెలుగులోకి..
- రెండు రోజుల అనంతరం పోలీసుల విచారణ

7

మత్తు దందా

డ్రగ్స్‌కు కేరాఫ్‌గా సంగారెడ్డి జిల్లా

- పారిశ్రామికవాడల్లో అల్ప్రాజోలం, మాదకద్రవ్యాల తయారీ
- దేశ, విదేశాలకూ అక్రమ రవాణా
- నేతలు, రియల్ వ్యాపారాల ముసుగులో చీకటి వ్యాపారం



సంగారెడ్డి జిల్లా డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రస్ మారుతోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా మత్తు దందా కొనసాగుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో డ్రగ్స్ మాఫియా రెచ్చిపోతోంది. జిల్లాలోని జిన్నారం, బొంతపల్లి, ఐడీఏ బొల్లారం, ఇస్నాపూర్, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతాల్లో మూతపడిన పరిశ్రమల్లో మత్తు పదార్థాలను గుట్టుగా తయారు చేస్తున్నారు. జిన్నారం మండలం కొడకంచి పరిధిలోని పరిశ్రమల్లో నిషేధిత డ్రగ్స్ తయారుచేసి దేశ, విదేశాలకు అక్రమ రవాణా చేసినట్టు గుర్తించారు. పోలీసులు దాడులు నిర్వహించి సుమారు రూ.70 లక్షల విలువైన 14 కిలోల డ్రగ్స్ తయారీ ముడి పదార్థాలు, ఆస్తులను సీజ్ చేశారు.

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మత్తు దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. పారిశ్రామికవాడల్లో మూతపడిన రసాయన పరిశ్రమలను నిషేధిత మత్తుపదార్థాల తయారీ కేంద్రాలుగా మారాయి. హైదరాబాద్ నగరానికి సమీపంలోని పటాన్‌చెరు, ఐడీఏ బొల్లారం, జిన్నారం, గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతాల్లో డ్రగ్స్‌ను యథేచ్ఛగా ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని హైదరాబాద్ నగరం, సంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలతో పాటు దేశ, విదేశాలకు సైతం రవాణా చేస్తున్నారు. ఇలా ప్రతీ సంవత్సరం కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్టు తెలుస్తోంది. బయటకు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ బడా నేతలుగా చెలామణి అవుతున్న కొందరు నాయకులు ఈ చీకటి దందా కొనసాగిస్తున్నట్టు పోలీసుల పరిశీలనలో వెల్లడవుతోంది.

అల్ప్రాజోలం తయారీ ముఠా గుట్టురట్టు

ఓ కెమికల్ పరిశ్రమలో నిషేధిత అల్ప్రాజోలంను తయారు చేస్తూ హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో విక్రయిస్తున్న ఓ ముఠాను సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు, గుమ్మడిదల పోలీసులు జనవరి 11 పట్టుకున్నారు. వారి వద్ద నుంచి అల్ప్రాజోలం తయారీకి ఉపయోగించే వస్తువులతోపాటు రూ.60 కోట్ల విలువైన ఆస్తులను సైతం పోలీసులు సీజ్ చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మెదక్‌కు చెందిన గిర్మగౌని సుధీర్‌గౌడ్ (47) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పటాన్‌చెరు మండలం ముత్తంగిలో నివాసముంటున్నాడు. పదేళ్లుగా భార్య శ్రీవాణి, అతని తమ్ముడు ప్రభుగౌడ్‌లతో కలిసి నిషేధిత అల్ప్రాజోలం విక్రయిస్తున్నారు. రెండేళ్ల క్రితం మరి కొందరితో కలిసి హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామ శివారులోని సాయిప్రియ కెమికల్స్ కంపెనీని కొనుగోలు చేసి అందులో అల్ప్రాజోలం తయారు చేస్తున్నారు. హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో విక్రయిస్తున్నారు. జనవరి 10న సుధీర్‌గౌడ్ అల్ప్రాజోలం విక్రయించేందుకు ముత్తంగి నుంచి మెదక్‌కు వెళ్తున్నట్టు క్రమంలో మంబాపూర్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో రూ.60 కోట్ల విలువైన ఆస్తులు, 740 గ్రాముల నిషేధిత అల్ప్రాజోలం, మూడు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోనే..

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోనే డ్రగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు డ్రగ్ మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఓ వ్యక్తి కొందరితో ముఠాగా ఏర్పడి అల్ప్రాజోలం తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాడు. సంగారెడ్డి పక్కనే ఉన్న ఫసల్‌వాదిలో నాలుగు యూనిట్లపై 2023 డిసెంబరు 27న పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. అల్ప్రాజోలం తయారీకి ఉపయోగించే సుమారు రూ.70లక్షల విలువైన ముడి పదార్థాలను, రెండు

మిగతా 8వ పేజీలో



అమీన్‌పూర్‌లో స్కిల్ యూనివర్సిటీ కోసం భూమిని పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి హరిచందన

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అమీన్‌పూర్‌లో స్థల పరిశీలన

- నవోదయ విద్యాలయానికీ..
- 993 సర్వే నంబర్‌లో 25 ఎకరాల గుర్తింపు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూమిని అధికారులు పరిశీలించారు. రోడ్లు భవనాలశాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన మంగళవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 993 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం కావాల్సిన సుమారు 15 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయగా అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ భూమిని సూచించారు. ఇదే ప్రాంతంలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు సైతం మరో 25 ఎకరాలు సిద్ధంగా ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో పాటు ఔటర్ రింగురోడ్డు, 9వ నంబర్ జాతీయ రహదారి కనెక్టివిటీ ఉండటంతో ఇక్కడే యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని హరిచందన తెలిపారు. ఆమెతోపాటు అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కేటాయింపులతో కబ్జాలకు చెక్

సర్వే నంబర్ 993లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, నవోదయ పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయిస్తే కబ్జాలకు అడుకట్ట పడే అవకాశం ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సర్వే నంబర్‌లో పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవడంతో గత ప్రభుత్వం మినీ స్టేడియం, రాక్‌గార్డెన్, మున్సిపల్ కార్యాలయం, సమీకృతమార్కెట్‌యార్డ్, పోలీసు స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు స్థలాలను కేటాయించారు. మిగిలిన భూములను స్కిల్ యూనివర్సిటీ, నవోదయ పాఠశాలకు కేటాయిస్తే కబ్జాలకు గురయ్యే అవకాశం ఉండదని భావిస్తున్నారు.

ఘనంగా కల్యాణం



జహీరాబాద్ పట్టణ పరిధి మహీంద్రా కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో 23వ అధ్యయన బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం, శేషవాహన సేవ, విష్ణుసహస్రనామ పారాయణం, చతుఃస్థానార్చలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు.

-జహీరాబాద్, (ఆంధ్రజ్యోతి)

అమ్మకు బోనం

మెదక్‌లో రేణుకా ఎల్లమ్మ 31వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-మెదక్ అర్బన్, (ఆంధ్రజ్యోతి)



బీవీఆర్‌ఐటీలో జాతీయస్థాయి ఈ–కార్ రేస్

ఐదు రోజుల పాటు పోటీలు

పాల్గొననున్న 80 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు

నర్సాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సొంతంగా తయారుచేసిన ఎలక్ట్రికల్ కార్ల జాతీయస్థాయి పోటీలకు మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ వేదిక కానుంది. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి 'ఎస్‌ఏఈ బాహా' పేరిట ఈ నెల 20 నుంచి 25 వరకు బీవీఆర్‌ఐటీలో పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు దేశంలోని 80 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఈ పోటీలు ఉత్తర భారతదేశంలోనే నిర్వహించే వారని, గత సంవత్సరం తొలిసారి దక్షిణ భారతదేశంలో బీవీఆర్‌ఐటీలో నిర్వహించామని చెప్పారు. గతేడాది పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో మరోసారి బీవీఆర్‌ఐటీకే అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఆటోమొబైల్‌రంగంలో కొత్త ప్రయోగాలు చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులకు గ్రహణం

- మంజూరైనా పంపిణీ చేయకుండా నిలిపివేత
- అధికార ప్రతిపక్షాల వైఖరితో ప్రతిబంధకం
- ఇప్పటికే ఒకసారి కాలం తీరిన చెక్కుల పునరుద్ధరణ
- ఎలక్షన్ కోడ్‌తో మరింత జాప్యం



సదాశివపేట తహసీల్దార్ కార్యాలయం

సదాశివపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సదాశివపేట బల్దియాలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి రాజకీయ నాయకులు గ్రహణం పట్టించారు. ప్రభుత్వం ఏడాది క్రితమే పెళ్లిళ్లు చేసుకున్న నవవధువుల కుటుంబం పేరున కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంజూరు చేసింది. ఓవైపు అధికార పార్టీ నాయకురాలి అనుచరులు చెక్కులు తమ నాయకురాలే పంపిణీ చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. మరోవైపు ప్రతిపక్ష పార్టీకి చెందిన నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులు ప్రొటోకాల్ మేరకు చెక్కులు తమ నాయకుడి చేతుల మీదుగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. రెండు పార్టీల నేతల ప్రతిపాదనలను అవును అనలేక.. కాదు అనలేక అధికారులు తమ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేసేందుకు సాహసించడం లేదు.

కాలం తీరనున్న చెక్కులు

సదాశివపేట పట్టణం, మండలంలో మొత్తం 169 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. పట్టణానికి 64 చెక్కులు, మండలంలో 29 గ్రామాలకు సంబంధించి 105 చెక్కులు మంజూరయ్యాయి. బీసీలకు 76, ఈబీసీలకు 1, ఎస్సీలకు 29, ఎస్టీలకు 6, మైనార్టీలకు 57 చెక్కులు వచ్చాయి. నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు మంజూరైన చెక్కులకు మూడు నెలల కాలపరిమితి మాత్రమే ఉంటుంది. ఈమేరకు 104 చెక్కులు 2024 సంవత్సరం అక్టోబరు 17వ తేదీతో కాలం చెల్లడంతో వాటిని తిరిగి 2025 జనవరి 27వ తేదీన పునరుద్ధరించారు. మరో 65 చెక్కులు 2025 మార్చి 10 నాటికి కాలం తీరిపోనున్నాయి. ప్రస్తుతం అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతూ చెక్కులను పంపిణీ చేయడంలేదు. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ ముగిశాక ప్రభుత్వం గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలను జరిపించేందుకు నిర్ణయం తీసుకుంటే లబ్ధిదారులకు శాపంగా మారే ఆవకాశాలు లేకపోలేవు. అధికారులు మంజూరైన చెక్కులను ఎలక్షన్ కోడ్ అంటూ మరింత కాలం పంపిణీ చేయకుండా ఉంటే ఇప్పటికే మంజూరైన 104 చెక్కులకు వచ్చే ఏప్రిల్ నెల 27వ తేదీ నాటికి, 65 చెక్కులకు వచ్చే మార్చి నెల 10వ తేదీతో కాలం తీరిపోతాయి. దీంతో అసలుకే ఎసరు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని ఆడబిడ్డల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికార, ప్రతిపక్ష నేతల ఒత్తిడికి తలొగ్గి అధికారులు ఎప్పుడో మంజూరైన చెక్కులను పంపిణీ చేయకపోవడం సమంజసం కాదని లబ్ధిదారులు వాపోతున్నారు.

తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌కు పీసీబీ నోటీసు

రామచంద్రాపురం టౌన్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ సిబ్బంది చెత్తను రోడ్డు పక్కన కాల్చుతుండడంపై పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు ఇచ్చింది. మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామ శివార్లలోని పాశమైలారం ప్రధాన రోడ్డు పక్కన కర్దనూరుకు వెళ్లేదారిలో మున్సిపల్ సిబ్బంది రోజూ చెత్తపోసి తగలబెడుతున్నారు. దీంతో చుట్టుపక్కల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పీసీబీ కాలుష్య నివారిణి పోర్టల్ జనవాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన పీసీబీ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. వివరణ ఇవ్వాలని కమిషనర్ సంగారెడ్డికి నోటీసులు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణ పాటించడం లేదని పేర్కొన్నారు.








ముగిసిన జగన్నాథస్వామి ఆలయ ఉత్సవాలు

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పరిధిలో జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజులుగా జరుగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. వినాయకుడు, లక్ష్మీదేవి, ఆంజనేయస్వామి, శివాలయం, దుర్గాదేవి, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఒరిస్సా పూరీజగన్నాథస్వామి ఆలయానికి చెందిన వేదపండితులు విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా హోమాల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు చంద్రారెడ్డిలు పూజల్లో పాల్గొన్నారు.













మండలాల అభివృద్ధి కృషి

● సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

రాయికోడ్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య అన్నారు. మంగళవారం రాయికోడ్ చౌరస్తాలో రూ.1.70 కోట్లతో చేపట్టిన సెంటర్ లైటింగ్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింహులు, నాయకులు కేదారినాథ్ పాటిల్, సతీష్‌కుమార్, హనుమాగౌడ్, విఠల్, కాశీనాథ్, ఖాజాపటేల్ ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీవైఎస్‌వో, స్పెషల్ ఆఫీసర్ ఖాసీంబేగ్


విద్యార్థులతో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ ఖాసీంబేగ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా యువజన క్రీడల అధికారి(డీవైఎస్‌వో), సంగారెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ ఖాసీంబేగ్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దత్తత పాఠశాలగా కేటాయించిన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా లేదాని ఆరాతీశారు. ఉపాధ్యాయుల బోధన, మాదిరి పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల విభజన, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

● మునిపల్లి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) :పదోతరగతి ఫలితాల్లో మండలాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలపాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషలాఫీసర్ రామాచారి సూచించారు. మంగళవారం నాడు మండల పరిధిలోని అంతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేసి ప్రత్యేక తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం సయ్యద్ సాబేర్ తదితరులు ఉన్నారు.

కొప్పోల్ జాతర ఏర్పాట్లపై సమీక్ష


సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయ్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయ ఆవరణలో నిర్వహించే జాతర ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25 నుంచి 28 వరరకు జరిగే ఈ ఉత్సవాల ఏర్పాట్లపై తహసీల్దార్ గ్రేస్‌బాయ్ పోలీస్, వైద్య, విద్యుత్, శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో చర్చించి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, వైద్యాధికారి శరిపొద్దిన్, వికాస్, ఆలయ కమిటీ సభ్యులు పద్మబా పిరాజు, రాజ శేఖర్‌రెడ్డి, పరమేశ్వర్‌రరెడ్డి, సీతారామారావు, కందుకూరి రవీందర్, గాండ్ల సంగమేశ్వర్, సతీష్‌గౌడ్, శంకర్‌గౌడ్, ప్రభుసార్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోచుకుని రోడ్డున పడేస్తారా..?

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్


సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనేక సంవత్సరాలుగా కార్మికుల శ్రమ దోచుకుని రోడ్డున పడేస్తారా..? అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ముందు మంగళవారం ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ యాజమాన్యం కార్మికులను భయభ్రాంతులకు గురిచేసి డ్యూటీలో నుంచి తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులు పరిశ్రమ అభివృద్ధికి గత నాలుగు సంవత్సరాలుగా కష్టపడ్డారని వారిని ఎలా తొలగిస్తారన్నారు. అకారణంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం డీసీఎల్ నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, కార్యదర్శి సాయిలు, నాయకులు రాజయ్య, ప్రవీణ్‌కుమార్, మహిపాల్, రాజిరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

శివ్వంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులుగా బోధించి ఆనందంగా గడిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

కొల్చారం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం ఛత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. క్రీడలలో గెలుపొందిన వారికి ఛత్రపతి శివాజీ జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామని సంఘం అధ్యక్షులు పల్వంచ దీక్షిత్ గౌడ్ తెలిపాంా.







వివరాలు సేకరిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో మృతదేహం

మంచాన పడిన భర్తకు సపర్యలు చేయలేక

అల్లుడితో కలిసి హత్య

- సహజ మరణంగా చిత్రీకరించే యత్నం
- బంధువులు నిలదీయడంతో విషయం వెలుగులోకి..
- హత్య జరిగిన రెండు రోజులకు పోలీసుల విచారణ

పాపన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచాన పడిన భర్తకు సేవలు చేయడం కష్టంగా భావించిన ఓ భార్య తన అల్లుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని బాచారం గ్రామానికి చెందిన కర్రెల ఆశయ్య (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 15న పొలం వద్ద కిందపడగా కాలుకు, నడుముకు గాయమైంది. నడవలేని స్థితిలో మంచానికే పరిమితవడంతో సపర్యలు చేయాల్సి వస్తుందని, వైద్యానికి డబ్బులు కూడా ఖర్చు అవుతాయని భావించిన భార్య శివమ్మ, అల్లుడు రమేష్‌తో కలిసి ఆదివారం అర్ధరాత్రి టవల్‌తో గొంతుకు ఉరి బిగించి హత్య చేశారు. ఇది సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. ఇంటికి చేరుకున్న బంధువులు, గ్రామస్థులు ఆశయ్య మృతదేహాన్ని పరిశీలించగా గొంతు వద్ద కమిలిన గాయం కనిపించింది. దీంతో అంత్యక్రియలు చేయకుండా వారిని నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. రాత్రి సమయం లో పోలీసులకు విషయం తెలుపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరి గంగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ హత్య విషయంపై కొంతమేర స్థానిక పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ అంతగా పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనపై రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి తన బృందంతో రెండు రోజుల తరువాత మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్

మునిపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ హెచ్చరించారు. కొండాపూర్ సీఐ వెంకటేశ్, మునిపల్లి ఎస్సై రాజేశ్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ కుమార్తె ఆలియాబేగంను ఈ నెల 11న అదే గ్రామానికి చెందిన వీరారెడ్డి, విజయ్ రెడ్డిలు కొట్టడంతో ఈనెల 16న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయమై సోషల్‌మీడియాలో కొందరు వివిధ రకాల పోస్టులు పెడుతూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టులు చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలిక పోస్టుమార్టం రిపోర్టు వచ్చేంత వరకు ఏమీ తేల్చలేమన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి మద్యానికి బానిసైన ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధి నార్సింగిలో జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన సంజీవ్ కుమార్ (25) ఉపాధి నిమిత్తం వచ్చి కామారెడ్డి జిల్లాలో గప్‌చుప్ బండి నిర్వహించేవాడు. అక్కడ శ్రీలత అనే అమ్మాయితో పరిచయం ఏర్పడి, ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. కొన్ని నెలలుగా మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో గప్‌చుప్ బండిని నిర్వహిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై నిత్యం మత్తులో ఉండేవాడు. భార్య ఎంత చెప్పినా వినకపోవడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఒంటరి వాడైన సంజీవ్‌కుమార్ సోమవారం రాత్రి అద్దె ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మెదక్ ఆసత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



శేకమ్మ మృతదేహం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా పిట్లం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్గాపూర్ మండలం అంతర్‌గాంకు చెందిన శేకమ్మ (50) అనే మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమె భర్త సంగయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. భార్యాభర్తలు మంగళవారం కామారెడ్డి జిల్లా కొడప్‌గల్‌కు బైక్‌పై వెళ్తుండగా, పిట్లం సమీపంలోని మార్దండ వద్ద బులేరో వాహనం ఢీ కొట్టింది. దీంతో శేకమ్మ చనిపోయింది. భర్త సంగయ్య పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఆయనను చికిత్స నిమిత్తం పిట్లం వైద్యశాలకు తరలించారు.

చేపల వేటకు వెళ్లి..

టేక్మాల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బొడ్మాట్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బొడ్మాట్‌పల్లి గ్రామానికి చెందిన చీలపల్లి లక్ష్మయ్య (59)ఈనెల 14న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. 17న సాయంత్రం గ్రామ శివారులో ఉన్న గుండు వాగులో శవమై కనిపించాడు. గుండు వాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మునిగి మృతి చెందినట్లు మృతుడి భార్య చీలపల్లి పోచమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవ పడి ఆత్మహత్య

టేక్మాల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో విసుగు చెందిన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి తంప్లూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి అశోక్ (38)కు 20 ఏళ్ల క్రితం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన వెంకటలక్ష్మితో వివాహం జరిపించారు. పదేళ్ల నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 16న కూడా గొడవ జరిగింది. దీంతో భార్య హైదరాబాద్ వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన అశోక్ ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. తల్లి చాకలి పోచమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని ఆమె భర్తను చంపే ప్రయత్నం చేసిన కేసులో టూ టౌన్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణ శివారులోని గుండ్ల చెరువుకు చెందిన మెరుగు శ్రావణ్ ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఆమె భర్తను చంపేందుకు కొంత మందితో కలిసి పథకం వేసి ఆమె భర్తను కిడ్నాప్ చేశారు. కాళ్లు చేతులు కట్టేసి బంధించి కర్రలతో దాడి చేశారు. తప్పించుకుని వచ్చిన బాధితుడు ఈ మేరకు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

మట్టి.. చెరబట్టి..

జోరుగా అక్రమ తవ్వకాలు.. చెరువులు పొలాల నుంచి తరలింపు
తరలింపు కోసం ఫార్మేషన్ రోడ్డు.. పట్టించుకోని అధికారులు



మట్టి తవ్వడంతో క్వారీని తలపిస్తున్న కందిలోని పగడం చెరువు

కంది, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి కూతవేటు దూరంలో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి పూట చెరువులు, కుంటలను కొల్లగొడుతున్నారు. అధికారులంతా ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడిలో ఉండగా, అక్రమార్కులు గుట్టుగా దందా కానిస్తున్నారు. కంది మండలంలోని పగడం చెరువులో రెండు హిటాచీలు, పది టిప్పర్లలో మట్టి తరలించారని, ఇందుకు ఎలాంటి అనుమతులు లేవని స్థానికులు చెబుతున్నారు. అలాగే, ఎద్దు మైలారంలో సర్వేనెంబర్ 140 లోని ప్రభుత్వ భూమిలో దాదాపు 400 ట్రిప్పుల మొరం తవ్వి తరలించారు. చుట్టూ పొలాలు ఉన్నా.. గట్టు చప్పుడు కాకుండా క్వారీని తలపించేలా తవ్వకాలు జరిపారు. దీనివెనుక ఆ గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నాయకుల హస్తం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

భూమి లీజుకు తీసుకుని..

జిల్లాలో నక్కవాగు పరివాహక ప్రాంతం విస్తరించి ఉన్న ఆయా గ్రామాల్లోనే ఈ మట్టిదందా ఎక్కువగా సాగుతోంది. ఈ వాగు పక్కనే ఉన్న భూమల్లో ఎక్కువగా ఇసుకపొరలున్నాయి. మట్టిదళారులు రైతులకు అరకొర డబ్బు ఆశచూపి పచ్చని పంట పొలాల్లోని పై పొరల్లో ఉండే నల్లమట్టిని ఇటుక బట్టీలకు, ఒకటీ నుంచి రెండు మీటర్ల లోతు నుంచి వచ్చే ఇసుకపొర లున్న మట్టిని కృత్రిమ ఇసుక తయారీ కోసం తరలిస్తున్నారు. దీంతో ఆ పొలాలు ఇప్పుడు క్వారీలను తలపిస్తున్నాయి. ఇలా తరలించిన మట్టిని బ్యాతోల్, ఎర్ధనూర్, చిద్రుప్ప, ఆరుట్లలోని నక్కవాగు చుట్టపక్కల కుప్పలుగా పోసి నిల్వ చేసుకుంటున్నారు. అదను చూసుకుని కృత్రిమ ఇసుకను తయారుచేస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న మట్టిని ఒక టిప్పర్‌కు రూ.6 వేల చొప్పున విక్రయిస్తున్నారు.



కంది మండలం బ్యాతోల్‌లో కృత్రిమ ఇసుకతయారీ కోసం నిల్వ చేసుకున్న మట్టి (ఫైల్)

అక్రమంగా రోడ్డు ఏర్పాటు

ఆరుట్ల నుంచి బ్యాతోల్‌కు మట్టిని తరలించేందుకు ఏకంగా నక్కవాగుపై అక్రమంగా మొరంతో ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటును సైతం ఏర్పాటు చేశారు. ఒక వాగుపై నుంచి రోడ్డును ఏర్పాటు చేసుకోవాలంటే అధికారుల నుంచి ఎన్ని అనుమతులు కావాలి. కానీ మట్టి దళారులు మాత్రం ఇవేం పట్టించుకుకోకుండా, ఎవ్వరిని లెక్క చేయకుండా రోడువేసి చక్కగా రాకపోకలు సాగిస్తున్నారు.

నామమాత్రంగా చర్యలు

మట్టి దందా ఇంతలా జరుగుతున్నా, నక్కవాగుపై ఏకంగా రోడ్డు ఏర్పాటు చేసిన అధికారుల చర్యలు మాత్రం తూతూమంత్రంగా సాగుతున్నాయి. ఇటీవల ఆరుట్ల శివారులోల అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న ఒక హిటాచీ, రెండు ట్రాక్టర్లను పట్టుకుని, అదే రోజు వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా ఎక్కువగా సెలవు రోజుల్లో పట్టపగలు, మిగతా రోజుల్లో రాత్రి వేళల్లో జరుగుతోంది. సెలవు రోజుల్లో, రాత్రి సమయాల్లో అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేస్తే స్పందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి దందాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

మట్టిని తరలిస్తే చర్యలు

అనుమతులు లేకుండా అక్రమంగా చెరువుల్లో గానీ, ప్రభుత్వస్థలాల్లో ఎవరైనా మొరం, మట్టిని తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటాం. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఉపేక్షించేదిలేదు. ఎంతవారినైన వదలిపెట్టం. అందరిపైనా కేసులు పెడతాం. వాహనాలను సీజ్ చేస్తాం. చెరువుల, కుంటలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం.

విజయలక్ష్మి, తహసీల్దార్, కంది

చెరువుకు చెర..

ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి



చెరువులో మట్టిని పోసిన దృశ్యం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెరువులను కొందరు అక్రమార్కులు చెరబడుతున్నారు. శిఖం భూముల్లో పాగా వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలలో అధికార పార్టీ నాయకులు చెరువులను పూడుస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే బొబ్బాయిపల్లి గ్రామంలోని ధర్మచెరువు గురికాగా, గ్రామస్థుల ఫిర్యాదుతో రగంలోకి దిగిన అధికారులు 1.20 గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నారు. తాజాగా లకుడారం ఇసుక చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒకరు తన పట్టా భూమి మొత్తాన్ని నల్లరేగడి మట్టితో నింపి వేశారు. గ్రామస్తుల ఫిర్యాదు రెవెన్యూ అటు ఇరిగేషన్ అధికారులు పనులను నిలిపివేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఎమ్మార్వో బదిలీ కావడంతో ఆ నాయకుడు రెండు రోజుల్లోనే భారీ ఎత్తున తన భూమిలో మట్టితో నింపివేశాడు. దీంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాలు చేపట్టకూడదు..

చెరువుల పరిధిలో పట్టా భూములు ఉన్నప్పటికీ రైతులు ఆ భూములలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదు. ఎవరైనా చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

సుజాత, ఎమ్మార్వో

డబుల్ బెడ్‌రూం కాలనీలో కార్డెన్ సెర్చ్

90 బైక్‌లు, 5 ఆటోలు స్వాధీనం



తూప్రాన్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం కాలనీలో మంగళవారం వేకువ జామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగాకృష్ణ ఏడుగురు ఎస్సైలు కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగితాలు సరిగ్గా లేని 90 బైక్‌లు, 5 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. పది రోజుల్లో వాహనాల కాగితాలు చూపించి, వాటిని తిరిగి తీసుకువెళ్లవచ్చునని ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఏడుగురు ఎస్సై ఆధ్వర్యంలో ఏడు బృందాలుగా, సుమారు 95 మంది పోలీసు సిబ్బంది ఈ కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకం

- ఎన్నికల పరిశీలకులు మహేశ్ దత్ ఎక్కా

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల కంటే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకమని నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మహేశ్ దత్ ఎక్కా అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆయన నోడల్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు తారా కళాశాల, అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్‌లోని డీఆర్‌సీ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దని, ఎన్నికల విధులకు హాజరుకాకుంటే ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు అందజేసి, సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, నోడల్ అధికారుల, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 26 నుంచి 'గీతం'లో వర్క్‌షాప్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వర్క్‌షాప్ జరగనుంది. 'పదార్థాల నిర్మాణ విశ్లేషణ కోసం ఎక్స్ రే డిఫ్రాక్షన్' అన్న అంశంపై జాతీయ స్థాయిలో మార్చి 26 నుంచి 28 వరకు ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు గీతం యజమాన్యం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఐఐటీ హైదరాబాద్‌లోని మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్ (ఎంఎస్‌ఎంఈ) విభాగానికి చెందిన ప్రొఫెసర్ రంజిత్ రామదురల్ వర్క్‌షాప్‌లో ప్రధాన వక్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మార్చి 24వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునని, రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర వివరాల కోసం 98607 82128ను సంప్రదించాలని వివరించారు.

అర్హత ఉన్నా రుణమాఫీ చేయరా

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీకి అర్హతలు ఉన్నా రుణమాఫీ చేయలేదని కల్హేర్‌కు చెందిన రైతు సంగమేశ్వర్‌రావు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడికి విన్నవించారు. తాను 2017లో కల్హేర్ ప్రాథమిక సహకార సంఘంలో రూ.99 వేల పంట రుణం తీసుకున్నానన్నారు. అయినప్పటికీ గత ప్రభుత్వ హయాంతోపాటు ప్రస్తుతమూ మాఫీ వర్తింపజేయలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై గత డిసెంబరు 9న ప్రజా వాణిలోకలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశానని, అయినప్పటికీ ఎలాంటి సమాచారం లేని, ఇప్పటికైనా స్పందించి రుణమాఫీ చేయించాలని కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సాగునీరు. తాగునీరు. విద్యుత్ అంతరాయం, రైతుభరోసా, రబీ సీజన్‌కు సాగునీటి సరఫరా వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కింద అర్హులైన అందరికీ పథకం వర్తిస్తుందన్నారు. అంతకుముందు సీఎస్ శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ అంశాలను సమీక్షించారు.

అవసరమైన చర్యలు చేపట్టాం

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి వివరించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద అర్హులైన అందరికీ పథకం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులకు అందిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు రామ్మూర్తి, సదానందం, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, డీఏవో రాధిక, డీపీవో దేవకీదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

డంపు.. కంపు వద్దు

కొనసాగుతున్న ఆందోళనలు
14వ రోజు బతుకమ్మ ఆడి నిరసనలు



బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 18 (ఆంధ్యజ్యోతి): మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్ వద్దంటూ స్థానికుల నిరసనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. మంగళవారం 14వ రోజు కూడా రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి. జేఏసీ కన్వీనర్ చిమ్ముల జైపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానందరెడ్డి అధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ఆందోళనలు చేపట్టారు. నల్లవల్లి గ్రామస్థులు మెదక్- హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు రాష్ట్ర చుక్క రాములు పాల్గొన్నారు. డంపు యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో భాగంగా గుమ్మడిదలలో మహిళలు నాయకులతో కలిసి బతుకుకమ్మ ఆటలు పాటలు పాడి వినూత్న నిరసనలు తెలియజేశారు గ్రామాలలో రిలే నిరహదీక్షలు కొనసాగాయి. ■

రెండవరోజుకు చేరిన దీక్షలు

నర్సాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్యారానగర్‌లో డంపుయార్డు వద్దంటూ నర్సాపూర్‌లో చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం రెండవరోజుకు చేరాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ పార్టీలన్నీ కలిసి అఖిలపక్షం ఏర్పాటు చేసి జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతున్నారు. మంగళవారం దీక్షలో శ్రీధర్‌గుప్తా, బిక్షపతి, రిజ్వాన్, లక్ష్మణ్, నాగభూషణంతోపాటు పలువురు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా పలువురు నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్మన్



సీఎం రేవంత్ రెడ్డితో దేవేందర్ రెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ను ఉమ్మడి మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి మంగళవా రం కలుసుకున్నారు. సహకార సంఘాల కాలపరిమితిని ఆరు నెలల పాటు పొడగించినందుకు ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి జానారెడ్డినీ ఆయన కలుసుకున్నారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు, తదితరులు ఉన్నారు.



భోగ్ భండార్ నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ

బంజారాల మార్గదర్శి సంత్ సేవాలాల్

పుల్‌కల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ బంజారాల మార్గదర్శి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జాట్రోత్ హరికిషన్ నాయక్ అన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సంత్ సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన సేవాలాల్ దేశమంతటా తిరిగి లంబాడీలను ఏకతాటిపైకి తీసుకువచ్చారన్నారు. అప్పట్లోనే నిజాం పాలకులకు ఎదురొడ్డి నిలిచిన ఘనత ఆయనదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహ బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అంతకు ముందు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భోగ్‌భండార్ నిర్వహించారు. గిరిజన విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బంజారాల పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాధిపతులు ఆచార్య రజనేష్, విజయ్ కుమార్, సునీత, జోషి శ్రీపాద, గౌరాసిక్ వాడి రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌నాయక్, సభ్యులు రాజునాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుతున్నది బీజేపీయే

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



విలేకరుతో మాట్లాడుతున్న ఎంపీ

సిద్దిపేట క్రైం,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అప్పుల్లో ఉంది.. ఇప్పుడు రాష్ట్రాన్ని కాపాడుతున్నది కేంద్రమేనని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలోని విద్రోహశక్తులు విదేశాలతో కలిసి దేశాన్ని విడదీయలని చూస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. తెలంగాణలో ఇప్పుడు అందరూ బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 10 వేల మెడికల్ సీట్లు పెంచారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే 317 జీవోను ఎత్తివేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి, విద్యాసాగర్ రాంచంద్రారెడ్డి, మల్లారెడ్డి, బాసంగారి వెంకట్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో 52 వేల ఉద్యోగాలు

- డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

మెదక్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు భంగపాటే ఎదురైందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 52 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టక పోవడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదోవన పట్టిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథకంలో దూసుకుపోతుందన్నారు. సమావేశంలో టీపీసీసీ నాయకులు సుప్రభాత్‌రావు, హఫీజుద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, అవారి శేఖర్, లింగం, వెంకటరమణ, సురేందర్ గౌడ్, క్రిష్ణాగౌడ్, ఆంజనేయులు గౌడ్, మధుసూదన్‌రావు, మల్లేష్‌గౌడ్, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి

బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి

● జిల్లా సంక్షేమ అధికారి హైమవతి

అల్లాదుర్గం,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారి హైమవతి అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. మంగళవారం మండలంలోని ముస్లాపూర్ గ్రామ రైతు వేదికలో ఆయా మండలాల అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన ప్రాజెక్ట్ స్థాయి సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలతో కలిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో పద్మలత, ఆయా మండలాల సూపర్‌వైజర్లు, పోషన్ అభియాన్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌లో వివరాలను పక్కాగా నమోదు చేయాలి : డీఈవో



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): యూడైస్ ప్లస్‌లో వెబ్‌సైట్‌లో వివరాలను పక్కాగా నమోదు చేయాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. సంగారెడ్డి పట్టణ శివారులోని శిశుమందిర్ పాఠశాలలో అన్ని యాజమన్యాలతో నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాప్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ఆపార్ నమోదు, ఆధార్ వ్యాలిడేషన్, యుడైస్ ఎర్రర్స్‌పై పలు సూచనలు చేశారు. అన్ని యాజమాన్యాలు ఆయా వివరాల నమోదులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ప్లానింగ్ కో ఆర్డినేటర్ తాజొద్దీన్, ఏపీవో సంతోష్, ఏఎస్‌వో రాజారాణి, వివిధ మండలాల ఎంఐఎస్‌లు, సీఆర్‌పీలు, పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

● డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డివో పీడీ శ్రీనివాస రావు

వెల్దుర్తి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) : రుణ మంజూరు లక్ష్యాలను పూర్తి చేయాలని వీవోఏ, సీసీలకు డీఆర్డివో పీడీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండల సమైక్య కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీ లక్ష్యాలను చేరుకోవాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల అందజేత 130 శాతం, బ్యాంకు లింకేజి స్త్రీనిధి ఎన్‌పీఏలను 0.5శాతంకు తగ్గించాలని సూచించారు. 'నా మొక్క నా బాధ్యత' లో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్‌ఎం గంగారాం, ఏపీఎం శంకరయ్య, సీసీలు సత్యం, యాదగిరి, కిషన్, రజిత, స్త్రీనిధి ఏఎం కరుణాకర్, వివోఏలు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ



టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినితో ఉపాధ్యాయులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో రాష్ట్ర స్థాయి భౌతిక రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ప్రతి జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులు ఆన్‌లైన్‌లో టెస్ట్‌లో పాల్గొన్నారు. ఇందులో న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి) జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినీ సాదియా నౌసిన్ 40 మార్కులకుగాను 33 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఐదవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆమెను డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, భౌతిక శాస్త్రం ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మురళీధర్, కోశాధికారి నరేందర్ అభినందించారు.

ఆలయ పూజారిని మార్చాలని తీర్మానం



ఆలయంలో సమావేశమైన గ్రామస్థులు

పుల్‌కల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలోని శ్రీ లక్ష్మీపద్మనాభస్వామి ఆలయ పూజారిని మార్చాలని ఆ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఆలయ మంటపంలో సమావేశమై పూజలు చేయని, అందుబాటులో ఉండని పూజారిని తొలగించి, మరొకరిని నియమించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం సంగారెడ్డిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌కు సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మయ్య, మాజీ చైర్మన్లు రోళ్లపాటి పండరి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు అంజిరెడ్డి, మన్నె నర్సింహులు, రోళ్లపాటి సత్యనారాయణ, గ్రామ పెద్దలు మల్లారెడ్డి, చిన్నరోళ్లపాటి రాజశేఖర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్ల పనులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):నారాయణఖేడ్ పట్టణంలో సీసీ రోడ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని నాలుగు, ఐదు వార్డులలో మంగళవారం సీసీ రోడ్లు నిర్మించారు. ఈ పనులను మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, కాంట్రాక్టర్ అర్థం సురేష్, బాబాఖాన్, మున్వర్ ఖురేషి పరిశీలించారు.

నీటి కటకట

● ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన ఖమ్మంపల్లె ఎస్సీ కాలనీవాసులు

మునిపల్లి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి ఖమ్మంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. ఏడాదిగా నీరు రాక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతుండడంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. నీటి ఎద్దడిని తీర్చాలని పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీకి చెందిన మహిళలు మంగళవారం రోడ్డుపైకి వచ్చి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇది కాస్త సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతికి దృష్టికి వెళ్లడంతో తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ఎస్సీకాలనీవాసులు

మహిళలు హక్కులపై అవగాహన పెంచుకోవాలి

● మెదక్ జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి నాగమణి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి నాగమణి తదితరులు

నర్సాపూర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహిళలకు తమ హక్కులపై అవగాహన లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని మెదక్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆడపిల్లలను రక్షిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భ్రూణ హత్యలు, లింగవివక్షత, లైంగికహింస, అక్రమరవాణ, బాల్యవివాహాలు సమాజ పురోగతికి మహిళల అభివృద్ధికి అవరోధంగా మారాయన్నారు. మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సఖి కేంద్రం జిల్లా అధికారి కళావతి మాట్లాడుతూ మహిళలకు ఏదేని సమస్య ఎదురైతే సఖి కేంద్రం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారి సౌమ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆడెప్ప, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'బీజేపీపై తప్పుడు ప్రచారం తగదు'

నర్సాపూర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలతో బీజేపీపై బురద చల్లి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒప్పందం చేసుకున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలి

● మెదక్ ఎస్పీ ఉదయకుమార్‌రెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ల పరిధిలో కల నేర ప్రవృత్తి ఉన్న వారిని ప్రతిరోజు తనిఖీ చేయాలని అదేవిధంగా నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో కేసుల సంబంధించి ఆరా తీసి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీసు సిబ్బంది, అధికారులు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారిపట్ల మర్యాదగ ఉండాలని ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవన్నారు. బాధితులు ఇచ్చే ఫిర్యాదుల పట్ల వెంటనే పరిష్కారం అయ్యేవిధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం త్వరలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగు కేంద్రం జూనియర్ కాలేజీని ఎస్పీ సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలు, భద్రత సదుపాయాలు పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌బూత్‌ను పరిశీలన

శివ్వంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగక్రిష్ణ, ఎస్సై మధుకర్‌రెడ్డి, ఎన్నికల అధికారులు ఉన్నారు.



డాక్టర్ ఇక్బాల్ కన్నుమూత

● గ్రామానికి భూములు ఇచ్చిన కుటుంబం..



డాక్టర్ ఇక్బాల్ (ఫైల్)

అల్లాదుర్గం, ఫిబ్రవరి 18. (ఆంధ్రజ్యోతి): జన్మభూమికి ఎంతో కొంత చేయాలనే ఉద్దేశంతో రూ. కోట్లు విలువ చేసే భూములను ప్రభుత్వ కార్యాలయ భవనాలకు విరాళంగా అందజేసిన కుటుంబంలోని డాక్టర్ హమీద్‌హుర్ రహ్మాన్ ఇక్బాల్ (70) కన్నుమూశారు. అమెరికాలో ఉంటున్న ఆయన అక్కడ మంగళవారం వేకువజామున కన్నుమూసినట్లు సమాచారం అందింది. అల్లాదుర్గం మండలం గడిపెద్దపూర్‌కు జలీల్‌హుర్ రహ్మాన్, అక్బరున్నీసాబేగంల కుమారుడైన ఇక్బాల్ వైద్య సేవలు అందిస్తూ అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన తల్లిదండ్రులు సర్పంచ్‌లుగా గ్రామానికి సేవలు అందించారు. ఆ సమయంలో వారి సొంత స్థలం రెండు ఎకరాలను ప్రభుత్వ ఆస్పత్రి భవనం కోసం, అర ఎకరం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం.. మరో ఎకరం ప్రభుత్వ పాఠశాల భవనం కోసం ఇచ్చారు. అలాంటి కుటుంబంలో పుట్టిన రహ్మాన్ ఇక లేరని తెలుసుకుని గ్రామంలో విషాదం నెలకంది. ఆయన మృతిపట్ల పలు పార్టీల నాయకులు దుర్గారెడ్డి, చెన్నగోరి విఠల్, సుధాకర్ గుప్తా, రమేష్ గుప్తా, చెన్నకృష్ణాగౌడ్, అభిలాష్‌రెడ్డి, రోషన్ అలీ, అలీ హుస్సేన్, సయ్యద్, సత్యనారాయణ గౌడ్, కృష్ణాగౌడ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వారణాసిలో మండల వాసి మృతి



రాంరెడ్డి(ఫైల్)

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏనక్‌పల్లి గ్రామానికి చెందిన బూత్కూర్ రాంరెడ్డి(70) ఈ నెల 13న ప్రయాగ్‌రాజ్ కుంభమేళ పుణ్యక్షేత్రానికి భక్తులతో తన వాహనంలో వెళ్లారు. దీంతో కుంభమేళ పూర్తి చేసుకున్న అనంతరం వారణాసిలో కాశీ విశ్వనాథ్ దర్శనం అనంతరం మంగళవారం విశ్రాంతి తీసుకుంటుండగా ఆకస్మాత్తుగా మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రాంరెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

జహీరాబాద్‌లో ఎంఐఎంను బలోపేతం చేయండి

● ఎంఐఎం ఫ్లోర్‌లీడర్, చాంద్రాయణ్‌గుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ



ఎమ్మెల్యే సమక్షంలో ఎంఐఎంలో చేరిన శేఖాపూర్ నాయకులు

జహీరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) :జహీరాబాద్ ప్రాంతంలో ఎంఐఎంను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనఉందని ఎంఐఎం ఫ్లోర్‌లీడర్, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జహీరాబాద్‌కు చెందిన పలువురు ఎంఐఎం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో స్థానికసంస్థలకు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల వారిగ పార్టీని బలోపేతంచేస్తు ఎన్నికల్లో ఎంఐఎం కీలకపాత్రను పోషించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం మండలంలోని శేఖాపూర్‌కు చెందిన వివిధ పార్టీలకుచెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో ఎంఐఎంలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు అత్తర్‌అహ్మద్, నాయకులు అక్బరుద్దీన్, ఇనాయత్ పాటిల్, మహ్మదలీ, అబ్దుల్లా, అక్బర్, మాజీద్‌పాటిల్, మహ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు దందా

(5వ పేజీ తరువాయి)

డిస్టిలేషన్ యూనిట్లను పోలీసులు సీజ్ చేశారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

విదేశాలకు అక్రమ రవాణా

సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో డ్రగ్స్ మాఫియా తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి నిషేధిత మత్తుపదార్థాలను తయారీ చేసి దేశ, విదేశాలకు అక్రమ రవాణా చేస్తోంది. గ్రామంలోని మూడెకరాల విస్తీర్ణంలో కెమికల్ ల్యాబ్‌ను స్థాపించి నిషేధిత డ్రగ్‌ను తయారు చేసేవారు. ఈ డ్రగ్‌ను హంగారీ వంటి దేశాలకు అక్రమంగా రవాణా చేసేవారు. ఈ యూనిట్లపై జిన్నారం పోలీసులు 2023 డిసెంబరు 7న దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.70లక్షల విలువైన 14 కిలోల డ్రగ్స్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను, ఆస్తులను సీజ్ చేశారు.

పారిశ్రామికవాడల్లో గుట్టుగా తయారీ

సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గడ్డపోతారం, ఐడీఏ బొల్లారం తదితర పారిశామికవాడల్లో కొన్ని పరిశ్రమల్లో గుట్టుగా డ్రగ్స్ తయారీ చేస్తున్నట్టు పోలీసులు తరచూ చేస్తున్న దాడుల్లో వెల్లడవుతున్నాయి. జిన్నారం మండలం గడ్డపోతారంలోని ఓ పరిశ్రమలో అనుమతులు లేకుండా ఔషధాలను తయారు చేస్తున్నట్టు అధికారుల తనిఖీల్లో తేలింది. గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక పరిధిలోని ఓ పరిశ్రమలోనూ ఓ ఔషధాన్ని అనుమతి లేకుండా తయారు చేస్తున్నట్టు గుర్తించి సీజ్ చేశారు.

బాల్యవివాహాలను ఆరికడుదాం

● జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి లలితకుమారి



మొక్క నాటుతున్న జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి, తదితరులు

జహీరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అందరం సంఘటితమై బాల్యవివాహలను ఆరికడుదామని సంగారెడ్డి జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి లలితకుమారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలలయంలో అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు, ఆయా గ్రామాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, ఆడపిల్లలకు భద్రత, మహిళల సంరక్షణ, తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సీడీపీవో ఆంజమ్మ, ఆయా మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. మున్సిపల్ ఆవరణలో వారు మొక్కలను నాటి నీళ్లు పోశారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని ఆందోళన

రేగోడు ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఐదు తరగతలకు ఒకే ఉపాధ్యాయుడు ఉండడాన్ని నిరసిస్తూ చౌదరిపల్లి గ్రామస్థులు మంగళవారం రేగోడులో ఆందోళన చేపట్టారు. 57 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమించాలని ఎంఈవో గురునాథ్‌ను కోరారు.



పాపన్నపేట మండలం తమ్మాయపల్లిలో భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీవో రమాదేవి

యూనివర్సిటీ నిర్మాణానికి భూమిని గుర్తించాలి

● కలెక్టర్ రాహుల్ రాజ్

పాపన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమిని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాపన్నపేట మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా యూనివర్సిటీ నిర్మాణానికి భూమికి సంబంధించి వివిధ ప్రదేశాలను సంబంధిత ఆర్డీవో రమాదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ మహేందర్‌గౌడ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన 10 నుంచి 15 ఎకరాల భూమిని గుర్తించేందుకు పాపన్నపేట మండలం తమ్మాయిపల్లి గ్రామంలో భూమిని పరిశీలించినట్లు తెలిపారు. అనువైన భూమికి సంబంధించి భూ పరిపాలన విభాగం హైదరాబాద్ వారికి ప్రతి పాదనలు పంపించాలన్నారు. ఆయన వెంటనే రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పారిశుధ్య డ్రైవ్

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఐడీఏ బొల్లారం పురపాలక పరిధిలో బుధవారం నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించనున్నామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించిన తరువాత పట్టణ ంలో శుభ్రత పాటించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వ్యర్థాలు రోడ్డుపై పడేస్తే జరిమానా విధించేటట్లు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నేడు విద్యుత్ అంతరాయం

పాపన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నర్సింహులు ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ మిన్పూర్, 33/11 కేవీ కుర్తివాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 11.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఖేడ్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20న సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సమితి బాధ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా చికిత్స, ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9676171527 నంబరులో సంప్రదించాలన్నారు.

కేసీఆర్‌కు మోయిద్‌ఖాన్ జన్మదిన శుభాకాంక్షలు



కేసీఆర్‌ను కలిసిన మోయిద్‌ఖాన్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు నారాయణఖేడ్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర మైనార్టీ సేల్ నాయకుడు మోయిద్‌ఖాన్ మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ మోయిద్‌ఖాన్ యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నట్లు ఆయన తెలిపారు.


వైభవంగా కల్యాణోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పట్టణ పరిధి బాలాజినగర్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో స్వామివారి కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు చంద్రారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

యువతి అదృశ్యం



జరపుల అనిత

టేక్మాల్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన ఘటన టేక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సర్మన్ కుంట తండాకు చెందిన జరపుల పుల్‌సింగ్ చిన్న కూతురు జరపుల అనిత (20) ఇంటర్ పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. ఈ నెల17న మధ్యాహ్నం పొలం వద్ద బోరు బంద్ చేస్తానని తన తల్లికి చెప్పి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో తన తండ్రి జరపుల పుల్‌సింగ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టా భూమిని అసైన్డ్‌గా మార్చారు

రేగోడు ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో పట్టా భూమిని అసైన్డ్ భూమిగా మార్చారని;రేగోడు మండలంలోని పోచారం గ్రామానికి చెందిన ఖాజాబీ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి పట్టా భూమిగా మార్చుటకు దరఖాస్తు చేసుకుని 10 నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. మర్పల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 19/2లలోని తన భూమిని అధికారుల తప్పిదంతో అసైన్డ్ భూమిగా నమోదైందన్నారు. పలుమార్లు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నామని ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా తన సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నర్సాపూర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డివిజన్ పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆయా పాఠశాలలకు వెళ్లి 20,640 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో 14వందల మందికి కంటి సమస్యలు ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు.